# వలయం

ఆమె చేతి వేళ్ళు నా మొహం మీద లయబద్ధంగా కదులుతున్నాయి. కళ్లమీదికి అదోలాంటి మత్తు మెలమెల్లగా పాకుతోంది.

రేపు వెళ్ళాల్సిన పార్టీకి యిప్పటినుంచీ ప్రిపరేషన్స్. బ్లీచింగ్.. ఫేషియల్.. కొత్తచీరకి ఫాల్ కుట్టించడం.. టైలర్ దగ్గరనుండి బ్లౌజ్ తెచ్చుకోవడం..

ఓగాడ్! టైం సరిపోతుందో లేదో! కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాను.

నేనిక్కడ.. ఈ బ్యూటీపార్లర్లో వున్నాను కానీ మనసు అప్పుడే రేపటి పార్టీలో తిరుగుతోంది.

కళ్ళు మిరుమిట్లు గొలిపే లైట్ల మధ్య నా అస్తిత్వమూ.. అందమూ ప్రతివారినీ కలవరపరుస్తాయి. సందేహం లేదు.

టమోటా రంగు చీర.. ఏరికోరి కొన్నాను. నా పసిమివన్నె శరీరం మీద ఆ చీరా.. కొత్త నెక్లెసూ.. చెవులకి కొత్తగా చేయించుకున్న జూకాలు.

శరత్ కళ్ళలో కనబడబోయే మెరుపు నా మనసుకు ఈ క్షణమే తడుతోంది.

"మేడమ్!" బ్యూటీషియన్ పిలుపుకు కళ్ళు తెరిచాను.

"స్టీమ్ తీసుకోండి." నవ్వుతూ చెప్పింది.

నేనూ నవ్వేశాను. "మీరు మసాజ్ చేస్తూండగానే కళ్ళమీదికి నిద్ర కూరుకు వచ్చేస్తుంది" అన్నాను.

ఆవిడ కళ్ళలో గర్వం లీలగా మెరిసింది.

అది సహజమేనేమో. రెండేళ్ళ క్రితమే పెట్టింది ఆవిడ ఈ పార్లర్. పెద్దగా అడ్వర్టయిజ్ కూడా చేయలేదు. కానీ ఈ రెండేళ్ళలోనే ఎంత పేరు సంపాదించిందో!

ఒకసారి ఆవిడ దగ్గరికి వచ్చిన వాళ్ళెవరూ మళ్ళీ మరో పార్లర్కి వెళ్ళరేమో బహుశా.

"ఏం మ్యాజిక్ చేస్తుందో!" సన్నగా.. పొట్టిగా.. నాజూగ్గా వుండే ఆవిడ వైపే పరీక్షగా చూస్తూ అనుకున్నాను.

నా మొహానికి మాస్క్ వేసి, కళ్ళ మీద కాటన్ పెట్టి అవిడ ప్రక్కకి వెళ్ళింది.

నా మనసులో మళ్ళీ పార్టీ మెదిలింది.

"రేపటి పార్టీలో ఎట్రాక్షన్ మీరే. మీకోసమే వస్తున్నాను నేనసలు." శరత్ అన్న మాటలు చెవుల్లో మళ్ళీ మళ్ళీ వినబడుతున్నాయి.

అతను అలా మాట్లాడడం నేనెపుడూ వినలేదు. అతనికోసం పడి చచ్చిపోయే స్త్రీలను చూశాను కానీ.. అతను తనంతట తానుగా యిలా ఒకరిని ప్రశంసించడం! ఆ ఒకరూ నేనే కావడం!!

సంవత్సరం క్రితం పరిచయమయాడు అతను. మొదటిసారి మావారి కోసమే వచ్చాడు, ఆయన కొలీగ్‌తో కలిసి.

మొదట డ్రాయింగ్ రూంలో నుంచి వాళ్ళ మాటలు వినపడ్డాయి నాకు. అతని గొంతు. స్పష్టమయిన ఇంగ్లీష్ ఉచ్చారణ..

చూడకముందే ఒకరకమయిన యిష్టం కలిగింది.

నేను కాఫీ తీసుకు వెళ్తుంటే అతను అంటున్నాడు. ".. ఇరవైనాలుగు గంటలూ కష్టపడడం ఎందుకు అంటారా! వెల్. దానికి యిరవై అయిదు కారణాలున్నాయి. మొదటిది ఏమిటంటే.. నిజమైన ఆనందం కష్టపడడంలోనే వుంది. రెండు, నేను రోజులో మొదటి గంటని ఆనందించాలనుకుంటాను. మూడు.. నేను రోజులో రెండో గంటని ఆనందించాలనుకుంటాను. నాలుగు.. " అతను చెప్తూండగానే మావారి కొలీగ్ పెద్దగా నవ్వేశారు. మావారు శృతి కలిపారు.

సరిగ్గా నేను ఆ గదిలో అడుగు పెట్టేసరికి.. అతను గోడమీద వున్న పెయింటింగ్ చూస్తున్నాడు.

నేను వెళ్ళగానే.. ఒక్కసారి తలతిప్పి, నన్ను గమనించినట్లుగా చేసి.. మళ్ళీ ఆ పెయింటింగ్‌ని తనివితీరా చూడబోయాడు.

కానీ ఆ ఒక్క క్షణంలో.. ఆ పెయింటింగ్ కంటే ఎక్కువగా నేనే అతన్ని ఆకర్షించడం వల్ల కాబోలు.. పూర్తిగా నావైపు తిరిగి.. నన్నే చూస్తూండిపోయాడు, ఏదో అద్భుతాన్ని దర్శిస్తూన్నట్లుగా.

మావారు పరిచయం చేశారు. "విశాల. మై వైఫ్" అని.

నేను " నమస్తే" అన్నాను, అతన్నుంచి కూడా ఆమాటే ఎక్స్‌పెక్ట్ చేస్తూ.

కానీ అతను.. సోఫాలో వెనక్కి వాలి.. నన్నే తదేకంగా చూస్తూ తల పంకించాడు, ఎవరో రారాజు వందనాలు అందుకుంటూన్నట్టూ..

ఆతర్వాత మెల్లగా తలత్రిప్పి, పెయింటింగ్‌ని చూస్తూ అన్నాడు "చాలా బాగుంది" అని.

మావారు చెప్పారు "అవును. నాక్కూడా చాలా యిష్టం. మా విశాలే వేసింది అది."

అతని కళ్ళలో ఆశ్చర్యం మెరిసింది.

"అద్భుతం" అన్నాడు. "నేనసలు వూహించలేదు సుమా! ఎవరో చాలా పెద్ద ఆర్టిస్ట్ వేసి వుంటాడనుకున్నాను."

నాకు యిబ్బందిగా అనిపించింది. చిన్నగా నవ్వి లోపలికి వచ్చేశాను.

నాలుగురోజుల తర్వాత అతను ఫోన్ చేశాడు, మావారి కోసం. నిజంగా ఆయన కోసమేనా! నాకిప్పటికీ అనుమానమే. చెప్పడం మాత్రం అలాగే చెప్పాడు.

"..ఆయనతో పనుంది. ఆఫీస్‌కి చేస్తే లేరన్నారు, యింటికి చేస్తున్నాను." అని.

ఆతర్వాత చాలాసేపు చాలామాటలు మాట్లాడాడు. అన్నీ నా అభిరుచుల గురించీ.. అభిప్రాయాల గురించే.

ఆ పరిచయం పురస్కరించుకుని నాలుగురోజుల తర్వాత మరొక ఫోన్.. మరొకటి.. మరొకటి.

అదంతా మావారికి ఎలా చెప్పాలో నాకు తెలిసింది కాదు. నాలుగు నెలల తర్వాత, మరొక చోట అందరం కలిసినపుడు అతనే చెప్పాడు. "మీఆవిడ అభిప్రాయాలు నాకు చాలా నచ్చుతాయండీ. ఆవిడతో ఫోన్‌లో మాట్లాడితే అర్థమయింది." అని.

కళ్ళమీద నుంచి దూది తీయడంతో నా ఆలోచనలకి బ్రేక్ పడింది. మొహం క్లీన్ చేశాక డబ్బులిచ్చేసి బయటకి వచ్చాను.

షాపింగ్ అంతా పూర్తి చేసుకుని యింటికి వచ్చేసరికి ఎనిమిదయింది. వాకిట్లోనే చెల్లి ఎదురయింది.

"ఎప్పుడొచ్చావే!" అన్నాను ఆశ్చర్యంగా.

"మధ్యాహ్నం ట్రయిన్‌లో వచ్చాను. నువ్వలా వెళ్ళావుట. నేనిలా వచ్చాను." అంది శైలజ.

"బావగారున్నారా నువు వచ్చేటప్పటికి!" దాని భుజాల చుట్టూ చేయి వేసి దగ్గరికి తీసుకుంటూ అడిగాను.

ఒక్క క్షణం చాలా ఆనందంగా అనిపించింది. కాని మరుక్షణంలో ఏదో యిబ్బంది మనసుకు తట్టింది. "రేపు బయటకి ఎలా వెళ్ళాలో!" అన్న ఆలోచనతో వచ్చిన యిబ్బంది.

రేపు అక్కడికి వెళ్ళబోయే ముందు.. మళ్ళీ పార్లర్‌కి వెళ్ళి లైట్‌గా మేకప్ చేయించుకోవాలనుకున్నాను. ఆ హడావుడి అంతా చూస్తే యిదేమనుకుంటుందో! అసలే దానికి యిలా బయట తిరగడాలూ.. అవీ నచ్చవు. బొత్తిగా పాతకాలం మనిషి.

"ఏంటక్కా ఆలోచిస్తున్నావు?"

నేను నవ్వాను. " ఏం లేదు. ఒక్కదానివే వచ్చావా!"

"ఊఁ. ఆయన క్యాంప్‌కి వెళ్ళారు. నాకు నిన్ను చూడాలనిపించింది. వచ్చేశాను." చిన్నపిల్లలా చెప్పింది.

"మంచిపని చేశావు." మనస్ఫూర్తిగా అన్నాను నేను.

శైలజ పద్ధతిలో, అలవాట్లలో ఒక రకమైన ప్రశాంతత వుంటుంది. అసలు దాని ప్రెసెన్సే చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. నేను అలాంటి ఆహ్లాదాన్ని అనుభవించి చాలా రోజులయింది.

నేరుగా వంటగదిలోకి నడవబోయాను.

"వంట చేసేశాను." అంది అది వెనుకనుంచి.

వేడి వేడి సాంబారు.. అన్నం.. కూర.. డైనింగ్‌టేబుల్ మీద నీట్‌గా అమర్చి పెట్టిన పచ్చళ్ళు..

నాకు సిగ్గుగా అనిపించింది. "వచ్చీరాగానే పని పడిందన్నమాట నీకు" అన్నాను.

"సరేలే. వంట చేయడం ఒక పనిలా నాకెపుడూ అనిపించదు. కాకపోతే నేను చేయగలిగింది అదొక్కటే కాబట్టి.. యిక దాన్నే ప..ని.. అని చెప్పుకోవాలి. అంతే." నవ్వింది.

నేనూ నవ్వాను. శైలజ పెద్దగా చదువుకోలేదు. అతికష్టం మీద యింటర్ పాసయ్యింది. ఆతర్వాత అమ్మకి సహాయం చేస్తూ యింట్లోనే వుండిపోయింది.

నేనేమో ఎమ్.ఎస్.సి. చేశాను. మ్యూజిక్‌లో డిప్లొమా తీసుకున్నాను. పెయింటింగ్స్ వేసి ప్రశంసలు పొందాను.

అందుకే దానికి నేనంటే ఒకరకమైన ఆరాధన. తనకన్నా నేను చాలా గొప్పదానినన్న గౌరవం.

"మాట్లాడుతూ మాట్లాడుతూ అలా మధ్యలో ఏదో ఆలోచిస్తూంటావేమిటక్కా నువ్వు!" శైలజ ప్రశ్నకు తెప్పరిల్లాను.

"ఏంలేదులే కానీ, ఈ సెనగలూ, అరటిపళ్ళూ యివన్నీ ఏమిటి!" అన్నాను.

"అవా! ఇందాక ప్రక్కింటివాళ్ళు పేరంటం పిలిస్తే వెళ్ళొచ్చాను."

నేను వెనక్కి తిరిగి "ఓసినీ!" అన్నాను ఆశ్చర్యంగా. "వాళ్ళు నీకు తెలీరు కదే!"

"సరే. వాళ్ళకీ నేను తెలీనుగా! అయినా వాళ్ళు పిలిచారుగా పాపం! వెళ్ళాను. రెండు పాటలు పాడాను. నీదీ, నాదీ రెండు తాంబూలాలూ తెచ్చుకున్నాను." డైనింగ్‌టేబుల్ దగ్గర కూర్చుంటూ చెప్పింది.

అది చెప్పిన తీరుకి నవ్వూ, చిరాకూ రెండూ వచ్చాయి నాకు. ఇలా పేరంటాలకు అటెండ్ అవడం.. వాళ్ళిచ్చినవన్నీ మూటలు కట్టుకు తెచ్చుకోవడం.. మామూలుగా అయితే నాకు నచ్చదు.

ఇదివరకైతే శైలూ యిలా ఒక పెద్ద కర్చీఫ్ తీసుకు వెళ్ళి సెనగలు మూటగట్టుకు రావడం చూసినప్పుడల్లా నవ్వేదాన్ని.

కానీ ఈరోజు దాన్ని ఏమీ అనలేక ఊరుకున్నాను. "పాపం! దానికి జీవితంలో యింతకన్నా కాలక్షేపాలు ఏముంటాయి!" అనిపించింది.

"బావగార్ని పిలు. అన్నం తిందాం." అంటూ లోపలికి నడిచాను.

భోజనాలయ్యాక అది వచ్చి నాప్రక్కనే పడుకుంది.

"తొందరగా పడుకోండి." అన్నారు ఆయన హాల్లోకి వెళ్తూ.

"ఇంకా నయం, మేం రాత్రంతా కబుర్లు చెప్పుకోవాలి." అరిచింది శైలూ.

ఏవేవో చెప్పబోయింది. కానీ నేను ఎక్కువసేపు మేలుకోదల్చుకోలేదు. సరిగా నిద్రలేకపోతే.. తెల్లవారేసరికి మొహం పీక్కుపోతుంది. కళ్ళ అందం అంతా నాశనమయిపోతుంది. ఇంక వాటిని ఏం చేసినా సాయంత్రం పార్టీలో అందంగా కనపడవు. అందుకే, "రేపు ప్రొద్దున మాట్లాడుకుందాంలే. పడుకో." అని దాన్ని కసిరి కళ్ళు మూసుకున్నాను.

అనుకున్నాను గానీ తెల్లవారినప్పటినుండీ మళ్ళీ హడావిడే. ఎలాగోలా వంట అయిందనిపించి ఆయన్ని ఆఫీసుకి పంపాను.

తలంటి పోసుకోవడం.. జుట్టు చిక్కు తీసుకోవడం.. నెయిల్స్ షేప్ చేసి పెయింట్ వేసుకోవడం..

అసలు ముందు టెన్షన్.. మూడింటినుంచే కంగారు నాకు.
శైలూ ఏమనుకుంటుందో.. దాన్నలా వదిలేసి బయటకి వెళ్తే! "నాకన్నా ఆ పార్టీ ఎక్కువా అక్కా!" అంటుందేమో!
నాలుగవుతూండగా బయల్దేరాను. "ఏమీ అనుకోకే శైలూ. తప్పకుండా వెళ్ళాలి. లేకపోతే వాళ్ళు ఏమైనా అనుకుంటారు. ఇక రేపటినుంచీ మనం చక్కగా కబుర్లు చెప్పుకుందాంలే." నేను బెరుకు బెరుకుగా సంజాయిషీ యిస్తుంటే అది నవ్వింది.
"ఏంటక్కా నువ్వు మరీనూ! వాళ్ళు అనుకుంటారో అనుకోరో అది వేరే విషయం కానీ.. ముందు నీకు యిలాంటివన్నీ ఎంత యిష్టమో నాకు తెలీదా! అయినా.. యింత మాత్రానికే నేనేమనుకుంటాను! ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క విషయంలో ఆనందం దొరుకుతుంది. నిన్న నేను పేరంటానికి వెళ్ళానని చెప్తే, యిష్టం లేకపోయినా నువ్వు వూరోక్కలేదూ!" అంది.
నేను ఉలిక్కిపడ్డాను.
ఏమిటది అనేది! అది వెళ్ళే పేరంటాలూ.. నేను వెళ్ళే ఫంక్షన్సూ ఒకటేనా! దాని యింట్రెస్టులూ.. నా ఆసక్తులూ ఒక్కటేనా!!
ఆటో రివ్వున వెళ్ళిపోతుంటే మనసులో యిదే ప్రశ్న మళ్ళీ మళ్ళీ చెలరేగుతోంది.
..దాని జీవితంలో యింతకన్నా కాలక్షేపాలేముంటాయి అని నిన్న జాలి పడ్డాను నేను. కానీ ఈరోజు అదేమంది! "నీకు ఆనందాన్నిచ్చే పనులు నువ్వూ చేసుకోవాలిగా అక్కా!" అంది, నా స్థాయికి ఎదిగిపోయినట్లుగా నవ్వుతూ. కాదు.. కాదు, నేనే తన స్థాయికి దిగిపోయినట్లుగా చూస్తూ...
నిజమా ! నేనూ అదీ ఒకటేనా!
"కాకపోతే ఏమిటి!" మనసు కొట్టినట్లే అడిగింది "ఎపుడైతే జీవితంలో సాధనకీ.. విజయాలకీ ప్రాముఖ్యం తగ్గిపోయిందో.. ప్రతిభనీ, పరిశ్రమనీ మర్చిపోయావో.. జీవితం ఆనందించడానికి మాత్రమే అనుకున్నావో.. అపుడు నువు తనకన్నా ఏవిధంగా గొప్ప!"
అవును. నిజమే. ఆనందం ఒక్కటే జీవిత ధ్యేయం అయితే శైలూ నాకన్నా ఎక్కువగానే ఆనందిస్తోంది. దాన్ని చూసి జాలిపడే హక్కు నాకెక్కడిది!
ఆటో ఆగగానే డబ్బులిచ్చేసి లోపలికి నడిచాను. అంతా ఖాళీగా వుంది. నిజానికి ఆదివారం మధ్యాహ్నం పార్లర్‌కి సెలవు.

నేను చాలా అవసరం అంటే "సరే రండి" అంది ఆవిడ.

"హెయిర్‌స్టయిల్ ఎప్పటిలాగానేనా!" నా జుట్టుకి వున్న క్లిప్ తీసేస్తూ అడిగింది.

తలూపాను. జుట్టు భుజాలమీద పరుచుకుంటుంటే తల వెనక్కి వాలుస్తూ అన్నాను "మీకు ట్రబుల్ యిస్తున్నాను కదా!" అని.

"అయ్యో పర్లేదు" అంది ఆవిడ "ఇంకా నాలుగే కదా! టి. వి. లో పిక్చర్ టైంకి అయిపోతుంది."

నేను ఆశ్చర్యంగా చూశాను. చిన్నపిల్లలాగా టి. వి. లో పిక్చర్ మీద యింట్రస్ట్ ఏమిటి ఈవిడకి! అనిపించింది.

అదేమాట కొంచెం మర్యాదగా అడిగాను.

ఆవిడ నవ్వింది. నేనే ఒక చిన్నపిల్లని అయినట్లూ లాలనగా చెప్పింది.

"ఒక్కొక్కళ్ళు రిలాక్సయ్యే పద్ధతి ఒక్కోరకంగా వుంటుంది. నాకెందుకో.. ప్రతివారం.. అయిదున్నర అయ్యేసరికి పనంతా పూర్తిచేసుకుని, దివాన్‌మీద కాళ్ళు బార్లా చాపుకుని, మాపిల్లలిద్దరినీ చెరొకప్రక్కా కూర్చోపెట్టుకుని, టైటిల్స్ దగ్గరనుంచీ సినిమా చూడటం యిష్టం. అది ఎంత చెత్త సినిమా అయినా సరే."

చేతులు చురుకుగా నామొహంపై కదులుతుంటే ఆవిడ చెప్తోంది. "వారం అంతా విపరీతమయిన పని వుంటుంది. ఎక్కడికీ వెళ్ళేందుకు వుండదు. ప్రొద్దున తొమ్మిది గంటలనుంచి సాయంత్రం ఏడింటి వరకూ పార్లర్లోనే వుంటాను. మిగతా కాస్త టైమూ యింట్లో పనితో సరిపోతుంది. ఆ పనులన్నీ చేస్తున్నపుడు ఆదివారపు సాయంత్రం రిలాక్సేషన్ గుర్తొస్తే ఆనందంగా వుంటుంది. ఆదివారం సినిమా చూసేటపుడు.. ఈ వారం రోజుల శ్రమా, అది తెచ్చే పేరూ.. నా ఈ చిన్ని సామ్రాజ్యం.. ఈ నేపథ్యం అంతా ఆనందాన్ని యిస్తుంది. అదొక సైకిల్ అంతే. బోర్ కొడితే తప్ప మార్చాల్సిన అవసరం లేదుగా!" గలగలా నవ్వింది.

నేను నవ్వలేకపోయాను. కళగా వున్న ఆవిడ మొహాన్నే తదేకంగా చూస్తూ కూర్చుండిపోయాను.

*****

నేను హొటల్‌కి వెళ్ళేసరికి ఆరున్నర అయింది. "హలో" అంటూ ఎదురొచ్చింది శారదాదేవి.

బాబ్డ్‌హెయిర్. . విశాలమయిన నవ్వు. . స్కైబ్లూ కలర్ చీర. . ముత్యాల నగలూ. .
యాభైఏళ్ళ వయసులో కూడా అందంగానే వుంది ఆవిడ. అందంగా వుండాలని
అనుకోవాలే గానీ అది పెద్ద అసాధ్యం కాదు సుమా అనిపించేలా.
ఏదో యిబ్బంది మనసును తొలిచింది. అంతేనా! నిజంగా అంతేనా! అనిపించింది.
శరత్ వచ్చాడు. అతని కళ్ళనిండా ప్రశంసల వెల్లువ. అది కూడా చిరాకుగానే
అనిపించింది. ఎందుకో ఆ ప్రశంస నాకు సంబంధించిన విషయంలా తోచలేదు. అతను నా
ఎదురుగా నిల్చున్నాడు. కంఠం క్రిందినుంచి కాలిగోరు వరకూ అవలోకగా చూసి
తలపంకించాడు.
ఈచీర ఎవరు డిజైన్ చేసుంటారో అనిపించింది నాకు. డ్రెస్ మేకింగ్‌లో డిప్లొమా
తీసుకున్న నా టైలర్ గుర్తొచ్చింది.
. . అతను తలెత్తి నా కళ్ళలోకి చూశాడు.
ఒకచేయి నా గడ్డం క్రింద ఆనించి. . మరో చేత్తో బ్రష్ పట్టుకుని. . ఏకాగ్రతతో పెదవులు
బిగించి. . అతిజాగ్రత్తగా మస్కారా దిద్దిన బ్యూటీషియన్ కళ్ళముందు మెదిలింది.
. . తేనెలూరుతున్నట్లున్న నా పెదవులని చూసి అతని కళ్ళు కొంటెగా నవ్వాయి.
"అంత డార్క్ షేడ్ వద్దండీ. ఈ కలర్ కరక్ట్‌గా మ్యాచ్ అవుతుంది." లిప్‌స్టిక్ దిద్దబోతూ
ఆవిడ అన్న మాటలు మనసులో కదిలాయి.
తల తిరుగుతూన్నట్లనిపించింది. కుర్చీని ఆసరా చేసుకుంటూంటే "ఏమైంది!
ఏమైంది!" అన్నారు వాళ్ళిద్దరూ కంగారుగా.
చెప్పాను.
"అయ్యో! అదేమిటి! కూర్చుంటారా!" అంది శారదాదేవి.
". . . వెళ్ళిపోతాను." బలహీనంగా పలికింది నా గొంతు.
"ఇలా ఎలా వెళ్తారు. . కాసేపు కూర్చోండి. . తర్వాత. ."
శారదాదేవి మాటలు పూర్తికాక ముందే "నేను డ్రాప్ చేస్తాను రండి." అన్నాడు శరత్.
ఇద్దరం బయటకి వచ్చి కార్లో కూర్చున్నాం. అతను డ్రయివ్ చేస్తూ మాటలు
మొదలుపెట్టాడు. మాట్లాడడంలో శరత్‌ని మించిన వాళ్ళు లేరు. ఆమాటలు చూసేగా
నాకింతటి ఆకర్షణ!
కానీ ఈరోజు మాత్రం అవేవీ నాబుర్ర లోకి ఎక్కడం లేదు. అతను చెప్తూనే వున్నాడు. నా
మనసులో మరేవో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

. . అతనే చెప్పాడు. . జీవితాన్ని ఆనందించడం అన్నిటికన్నా ముఖ్యమని. అవును.
ముఖ్యమే. ఆ. . నం. . దిం. . చ. . డం. . ముఖ్యమే.
ఆపని నేనెపుడు చేయలేదని! చిన్నప్పటినుంచీ ప్రతిక్షణమూ నేను ఆనందంగానే గడిపాను.
పెద్దవాళ్ళ దీవనలు. . ప్రశంసలు. . అమ్మా నాన్నల కళ్ళలో గర్వపు మెరుపులు. . చెల్లి కళ్ళలో ఆరాధన. వాటన్నిటికన్నా గొప్ప ఆనందం ఇతనేం చూపించాడని!
తలతిప్పి శరత్ వైపు చూశాను. నేనలా తదేకంగా గమనించడం చూసి అతను నవ్వాడు.
నాకు మొదటిరాత్రి మావారు చూసిన చూపు గుర్తొచ్చింది. అలా ఎదురుగా కూర్చోపెట్టుకుని చూడలేనట్లూ. . గుండెల్లో దాచేసుకోవడం ఎలాగో తెలీనట్లూ. . అసలు నన్నేం చేసుకోవాలో అర్థం కానట్లూ. .
ఆరోజే కాదు. ఇప్పటికీ అంతే ఆయన.
"నాలో ఏ ప్రతిభ చూసి దేవుడు నిన్ను నాకోసం సృష్టించాడంటావ్!" అంటారు.
నా అందాన్ని శరత్ కన్నా ఆయనే ఎక్కువసార్లు మెచ్చుకున్నారన్న విషయం గుర్తు రాగానే చెప్పలేనంత నిస్సత్తువ ఆవరించింది.
తెలివయినవాళ్ళం అనుకోవడమే మూర్ఖత్వానికి నిర్వచనమేమో అనిపించింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూంటే కళ్ళు మూసుకున్నాను.
హటాత్తుగా శరత్ చేయి నాచేతి మీద ఆనింది. అరికాల్లో కంపరం సుడులు తిరిగింది.
"ఇంకా అలాగే వుందా!" అంటున్నాడు.
నేను మాట్లాడలేదు. కళ్ళు తెరిచేందుకు శక్తి కూడదీసుకోబోతూంటే మళ్ళీ అతనే అన్నాడు. "ఎవరిదో దృష్టిదోషమే సుమా నిజంగా. . యివాళ నువు చాలా బాగున్నావు. . బాపూ బొమ్మలా. ."
చెంపమీద కొట్టినట్లూ కళ్ళు తెరిచాను. "కారాపండి శరత్, యిక్కడ దిగిపోతాను." అన్నాను.
సడన్‌బ్రేక్‌తో కారు ఆపుతూ అతను అయోమయంగా చూశాడు. "ఇక్కడా! ఈ చీకట్లోనా!"
"అవును" అభావంగా చూస్తూ చెప్పాను. "కొంచెం పనుంది యిక్కడ." అతను మరో మాట మాట్లాడకముందే కారు దిగాను. పెదవులమీదికి నవ్వు తెచ్చుకుని "బై" అన్నాను.

వడివడిగా అడుగులు వేసి ప్రక్క సందులో నుంచి మెయిన్ రోడ్డుమీదకి వచ్చి ఆటో ఎక్కాను.

"బాపూ బొమ్మ.. బాపూ బొమ్మ.." ఆ మాటే చెవులలో పదేపదే వినబడుతోంది, గుండెని మెలిపెడుతూ.

బాపూలా బొమ్మలు గీయాలన్నది ఒకప్పటి నా కల. నా ఆశయం. అలాంటి నేను.. బాపూనవ్వాలనుకున్న నేను.. కేవలం బాపూ బొమ్మగా మిగిలిపోయానా!

ఆటో దిగడం ఆలస్యం మేడమీదికి పరుగెత్తాను.

"ఏంటక్కా! అప్పుడే వచ్చేశావు!" వంటగది గుమ్మంలోనుంచి శైలజ అరిచిన అరుపు మధురంగా వినిపించింది.

నేరుగా వాష్‌బేసిన్ దగ్గరికి నడిచి మొహం మీద నీళ్ళు చల్లుకున్నాను. చీర మార్చుకుని నా బీరువా తెరిచాను. బ్రష్‌లూ.. కలర్సూ గదిమధ్యలో కుప్పగా పోసుకుని చతికిలబడ్డాను. శైలూ వేడివేడి ప్లేట్ పట్టుకొచ్చింది.

"అక్కా! చోలే తింటావా! నిన్నటి సెనగలతో చేశాను.." నాప్రక్కనే వచ్చి కూర్చుంటూ అడిగింది. నేను తలూపాను.

గదిలో ఆమూల.. కార్డ్‌బోర్డ్ మీద .. సగంలో ఆపేసిన పెయింటింగ్ అలాగే వుంది. లాస్ట్‌టైం వాడాక, కనీసం క్లీన్ చేయని బ్రష్‌లు అడ్డదిడ్డంగా నాచేతులమధ్య వున్నాయి. ఆర్నెల్లయినా వాటిని కొరుక్కు తినకుండా పురుగులూ.. బొద్దింకలూ అలా వదిలేయడం ఆశ్చర్యమే!!

ఒక్కొక్క బ్రష్‌మీద అంగుళం మేర పెయింట్ వుంది. క్లీన్ చేసేకొద్దీ వస్తూనే వుంది. అదలా వస్తున్నకొద్దీ గుండెలలో ఆనందం వూటలా వూరుతోంది.

శైలూ నానోటికి అందించిన చోలే .. నిజం.. నిజంగా అ.. ద్భు.. తం.. గా వుంది!!

*****